సంధ్య కెంజాయ, సాగర జలాలమీద ప్రతిఫలించి, అలలపై తూగుటూయెలలూగుతోంది. వినీల విశాల గగనంలో విహంగాలు విమానం చప్పుడుకు బెదిరి మరింత వేగాన్ని పుంజుకున్నాయి గూళ్ళు చేరడానికి. స్కూలు పిల్లలు కేరింతలు కొట్టుకుంటూ ఇళ్ళముఖం పట్టారు.

వంటయింట్లో పనిలో వున్న సరళ, గదిలో పడుకున్న వసుంధరతో "అమ్మా వసూ! పాలవాడొచ్చినట్లున్నాడు, చెంబు చూసి పాలు తీయించి పుచ్చుకోమ్మా" అని కేకవేసింది.

కళ్ళు తుడుచుకుని, మంచం మీదనుంచి లేచింది వసుంధర. అద్దంలో చూసుకుంటూ బొట్టు జుట్టు సవరించుకుంది. వంటింటిలోకొచ్చి పాలగిన్నె తీసుకుని వీధి గుమ్మంలో నిలుచుంది.

పాలవాడు చేట పెయ్యని గేదె ముందు పెట్టి పాలు పేపించే ప్రయత్నం చేస్తున్నాడు.

గేదె మాటిమాటికీ చేట పెయ్యని మూతిమాస్తూ 'అంబా' అని అరుస్తోంది హృదయ విదారకంగా.

# పాలవెల్లి

## సిదియుద్ధం రమణయ్య

1986 దీపావళి

కథల పోటీలో

సాధారణ ప్రచురణకి

ఎన్నికైన కథ

'దూడ ఎప్పుడో చచ్చిపోయినట్లుంది. అప్పుడే చేటపెయ్యని ఎట్లా తయారు చేసారో అచ్చు దూడ లాగే వుంది' అనుకుంటూ ఆ దూడకేసే విషాదంగా చూస్తోంది వసుంధర.

దానిలో జీవం లేదు. దాని ముఖ కవళికల్లో తుది మరణ వేదన తాలూకు ఛాయలు మిగిలి వున్నాయి.

గేదె ఎంతకీ పాలు పేపక పోవడంతో పాలవాడు దాన్ని బూతులు తిడుతున్నాడు. మోచేత్తో డొక్కలో పొడుస్తున్నాడు.

అదే చూస్తోకపోతోంది వసుంధర.

మళ్ళా పొదుగు దగ్గర కూర్చున్నాడు.

అది పాలు పేపలేదు.

నోరు లేనంత మాత్రంచేత బాధలేదా దానికి? అదీ మానవుడు పట్టించుకోక పాలెందుకు పేపదు? అని కోపగిస్తున్నాడు.

పాలవాడు రెట్టించిన కోపంతో లేచాడు. తోక గిరగిరా తిప్పాడు. ఎక్కడెక్కడో దాన్ని చూపాడు. తన వేలు పేడవేసే రంధ్రంలో పెట్టాడు.

అది బాధతో విలవిల్లాడి గిరగిర తిరుగుతూ మరింత అరుస్తోంది.

వసుంధర మరింక వుండబట్టలేకపోయింది.

"ఛీ ఛీ! ఏంటది? అలా చేయకు. చేతులు కడుక్కో" అని కసిరింది. తిరిగి-"మేం పాలు తీసుకోం నువ్విలా చేస్తుంటే" అంది.

పాలవాడు జంకి చేతులు కడుక్కున్నాడు.

"ఎంతకీ పాలు పేపదమ్మా దీని తస్సాదియా" అని మళ్ళా కూర్చుని పొదుగులో వెయ్యి పెట్టాడు.

"పాలు పేపడానికి దానిష్టమా? నీ ఇష్టమా? నా ఇష్టమా? దూడ వుంటే పేపును. పాలకి కక్కుర్తిపడి దూడల్ని చంపేస్తారు మీరు. పాలు కాసిన్ని వదిలితే అవి పెద్ద వైతే మీకు అమ్ముకుంటే డబ్బే కదా! మీకా జ్ఞానం వుండదు. దాని తల్లిపాలు దాన్ని తాగనీయరు. కడుపు మాడ్చి చంపుతారు.

"కాదండమ్మాయిగోరూ! అవి పాలు ఎక్కవయే పస్తాయి" అన్నాడు విరాగ్గా.

వాడి మాటకు ముందు చిన్న నవ్వు. తరువాత ఏడుపు వచ్చేసాయి. ఆ దుఃఖం మరి ఆపగలిగేది కాదు. వెక్కి వెక్కి ఏడుస్తూ నోట్లో గుడ్డ కుక్కుకుంటూ ఇంట్లోకి పరుగులాంటి నడకతో వచ్చేసింది వసుంధర. అపుడే సైకిల్ మీద వస్తున్న ఆమె అన్న అది చూశాడు.

"అమ్మా వసూ, ఏంటయిందమ్మా" అంటూ ఆదుర్దాగా లోపలికి వచ్చాడు. అప్పటికే వసుంధర గదిలోకి వెళ్ళిపోయి తలుపులు బిడాయించుకుంది. ఆయి వంటి పరిస్థితిలో ఎవరి ఓదార్పునీ ఆమె భరించలేదు. ఏకాంతంగా కరువుదీరా ఏడవాలనుకుంటుంది.

వంట ఇంటిలోకి వెళ్ళి కూరల సంచీ భార్యకు అందిస్తూ "వసూ ఎందుకు ఏడుస్తోంది?" అని ప్రశ్నించాడు ఆమె అన్నగారు వేణు.

"ఏమోనండీ పాలవాడు, ఆమె ఏమైనా అనుకున్నారేమో" అంటూ హాల్లోకొచ్చింది.

వేణు గబగబా వీధిలోకొచ్చి "అమ్మాయిగారూ నువ్వు ఏమైనా గొడవ పడ్డారా?" అని అడిగాడు పాలవాణ్ణి.

"లేదండి బాబుగారు అమ్మాయిగోరేమో చేట పెయ్యని మాసి, గేదని మాసే ఊఁ ఇదయిపోనారు.

దూడని చంపేసినామంటూ" అని తీసిన పాలు గిన్నెలోకి కొలిచి ఇచ్చాడు.

వేణుకి అర్థమయిపోయింది.

"రేపు ఈ గేదెని తీసుకురాకు. మరో దానిని తీసుకురా. దూడ వున్నదాన్ని" అని నిట్టూరుస్తూ భార్యతోసహా ఇంట్లోకి వచ్చేసాడు.

గదిలో వసుంధర వెక్కి వెక్కి ఏడుస్తోంది. తలుమకు తలుమకు కుమిలిపోతోంది.

వదినా, అన్నలు తలుపు తీయమని మృదువుగా అడిగినా తీయలేదు.

ఇతరుల ఓదార్పుతో ఉపశమించేదా తన దుఃఖం? మరువ గలిగేవా ఆ సంఘటనలు, సన్నివేశాలు? ఆ రోజుల్లో-

మనసులో ప్రేమ, గుండెల్లో పాలూ, కళ్ళలో దుఃఖము పొంగి పొర్లుతున్నాయి. పాపాయికి, జ్వరం వదిలితే విరోచనాలూ, విరోచనాలు వదిలితే జ్వరం. తను చిన్న ఉద్యోగం వెలగబెడుతోంది. ఎన్నాళ్ళకి సెలవులు పెడుతుంది?

ఈ ఉద్యోగం కాస్తా ఊడితే, తన కుటుంబం పస్తుండాలి. ప్రస్తుతం ఇంకో ఆదాయం లేదు. ఇంట్లో రెండో ఆడదిక్కేలేదు. 'పాప ఎలా వుందో ఇంట్లో భర్త, మామగారు సరిగా చూస్తున్నారో లేదో'.

పాప తలపులతో జాకెట్టు తడిసి బిగిసిపోతోంది.

దుఃఖం పట్టశక్యంగాకుండా వుంది తన దైన్య స్థితికి. పాపకి మంచి మంచి పాల డబ్బాలు కొనలేదు. తన పాలు ఇయ్యలేదు. అంటే తను ఉదయం ఎనిమిది గంటలకే ఇల్లు వదలాలి. బస్సులు దొరికి ఆఫీసుకు చేరే సరికి ఆఫీసు వేళ అయిపోతుంది. ఒకవేళ బస్సులు దొరక్కపోతే ఏ రిక్షాలోనో వెళ్ళాలి.

ఆఫీసుకు వస్తూనే టాయ్‌లెట్‌లోకి వెళ్ళింది. ముఖం కడుక్కుని పౌడరద్ది, బొట్టు పెట్టుకుంది. ముఖంలో ఏడ్చిన ఆనవాళ్ళు చెరిగాయిగాని, కళ్ళు ఆ విషయాన్ని స్పష్టంగా చెబుతూనే వున్నాయి. ఆఫీసులో చూసినవారు తలోరకంగాను ఊహాగానాలు చేస్తారు, చేయనియ్యి.

మనసును సమ్మాళించుకుని పాప తలపులు ప్రక్కకి పెట్టి ఫైళ్ళు ముందుకు లాక్కుంది.

ఎంత ప్రయత్నించినా పని సరిగా చేయలేక పోతోంది. లంచవర్ దాకా ఎలాగో లాక్కొచ్చింది. ఆ తరువాత తన కొలీగ్ ఒకరు వుండబట్టలేక అడగనే అడిగాడు. "ఏమండీ ఒంట్లో బాగోలేదా? మీ పని నే చూస్తాలెండి. సెలవు పెట్టి వెళ్ళిపోండీవేళకి" అన్నాడు.

అనడమే తడవుగా ఆపని చేసేసింది.

ఆఘమేఘాలమీద ఇంటికొచ్చింది.

ముందు వరండాలో మామగారు నిద్ర దీస్తున్నారు. లోపలి గదిలో పాప మంచంమీద నిద్రపోతోంది. పేపరు గుండెలమీద వేసుకుని రఃజీఛైర్‌లో భర్త నిద్దిస్తున్నాడు.

అయితే పాపని ఎవరు చూస్తున్నట్లు?

గబగబా పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కుని చీర మార్చుకుని వచ్చింది.

ఆ అలికిడికి భర్త నిద్ర లేచాడు.

"ఏం వచ్చేసావ్ వసూ?" అన్నాడు.

ఏమీ చెప్పలేదు వసుంధర.


మెల్లిగా పాప ప్రక్కన పడుకుని ఒంటిమీద చేయి వేసి చూసింది. ఒళ్ళు కాలిపోతూనే వుంది.

ప్రక్కన పడుకుని పాలు అందించబోయింది. పాప పెదవులు ఆరిపోయినట్లు వుండే...

"దాన్నెందుకు లేపుతావు? ఆకలి వేస్తోంది కాస్త. ఉప్మా చెయ్యి ఆజ్ఞాపించాడు భర్త.

"పాపకి మందు వేసారా?"

"ఆ వేశాను."



"పాలు పట్టారా?"

జ్వరంతో పాలేం తాగుతుంది? రెండు చెంచాలు గ్లాకోజు, బార్లీ పోశాను."

"పెదాలు ఎండిపోయాయి. కాస్త పాలిచ్చి వస్తా నుండండి."

"నిద్రపోతున్నదాన్ని లేపొద్దంటే వినవేం?"

"నిద్రలోనూ పాలుతాగుతారండీ పసి పిల్లలు."

అతని మాట వినిపించుకోకుండా పాప పెదవికి పాలు అందించింది. పాప పాలు అందుకుందిగాని, పాలు గడ్డకట్టి రొమ్ము గట్టిపడడంవల్ల పాపకి నులువియ్యలేదు.

లేచి బాత్‌రూంలోకి వెళ్ళి బాధగావున్న కాసిన్ని పాలు పిండేసి మళ్ళీవచ్చి పాలిచ్చింది. కొద్దిగా తాగింది పాప.

"చెప్పిన మాట వినవు వసూ మొండివి. నా ఉద్యోగం పోయింది. నువ్వు ఉద్యోగం చేస్తున్నావు. నీ నిర్లక్ష్యానికి అదే కదా కారణం?"

ఆ మాటకి చాలా కష్టం తోచింది. అగ్ని మీద ఆజ్యం పోసినట్లయింది. సమ్మెటతో గుండె మీద ఎవరో బాత్తున్నట్లు అనిపించింది.

చటుక్కున లేచింది. "పాప పరిస్థితి ఇలా వుంటే మీకలా మాట్లాడ్డానికి మనసెలా ఒప్పిందండీ, పాప మీకు మాత్రం బిడ్డ కాదా?"

"దానికి జ్వరం. ఆకలి వుండదు. దానికి పాలిస్తా నంటావేమిటి? ఆకలితో వస్తున్నాను. కాస్త ఏమైనా వెయ్యి నాకంటే వినిపించుకోవేమిటి?

"నేనిపుడు రాకపోతే ఏం చేసే వారు?"

"హోటల్ నుంచి తెప్పించుకొనేవాణ్ణి"?

"మనకంత డబ్బు ఎక్కువైపోయిందా? మీకు మీ నాన్నగారికీ వంటలన్నీ వచ్చు. కాస్త ఇబ్బంది వచ్చినపుడు చేసుకుంటే తప్పా?"

"అదే అదే మీ ఆడవాళ్లందరికీ వస్తున్న జబ్బు. మేం మగరాయుళ్లమై పోతాం. మీరు అమ్మలక్కలు అయిపోండి అని మీరు ఎంత కొట్టి, వెర్రి కొద్దీ అలా అవుతున్నారు కాని, మాకా వెర్రి లేదు అనడం లేదు"

అవసరమై ఆడవాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. అవసరమై మగాళ్లు ఇంటి పనులు చేసి స్త్రీకి సహాయ పడితే తప్పేమిటి? ఆడా మగా ఏమిటి? మీరూ నేను ఏమిటి? మనం ఒకటి కాదా? మన కుటుంబం ఒకటి కాదా? కుటుంబ సంక్షేమం కోసం అందరూ అయికమత్యముతో పాటుపడాలి. ఇపుడు నే తెస్తున్న డబ్బు, మన కుటుంబం మొత్తానికి ఉపయోగపడ్డం లేదూ? మీ కంటె ఉద్యోగం పోయింది. మామగారికి పెన్షన్ డబ్బు లున్నాయి. ఒక్క పైసా అయినా ఇంటి ఖర్చులకిస్తున్నారా?"

'అదే అదే నీ అహం నాకు తెలుసు వివరించనక్కర లేదు."

"అహం కాదండీ అవసరం. మా ఆవేదన" ఇంయీ ఇంక అతనితో వాదించి ప్రయోజనం లేదని వంటింట్లోకి వెళ్లి ఉప్మా పోపు పెట్టింది.

ఈ గడబిడలో పాప లేచి ఏడుపు లంకించుకుంది..

దాని ఏడుపుకు వరండాలో పడుకున్న మామగ్గారు లేచి," టీ పెట్టరా అబ్బాయీ కోడలు వచ్చినట్లుంది. టీ పెట్టమను తల పగిలిపోతోంది" అని మరో ఆజ్ఞ జారీ చేసాడు.

చేతులు కడుక్కుని ఏడుస్తున్న పాపని ఒళ్లో వేసుకుని అలాగే ఉప్మా, టీ తయారు చేసి వారికిచ్చింది. తరువాత పాపని ఊయలలో వేసి ఊపి, నిద్ర బుచ్చి, వెంటనే అంట్లు తోమి వంట చేసింది.

తను తల్లి, పాలవెల్లి, పాలు పొంగి పొర్లిపోతున్నాయి. పాపాయి అందులో కొంచమైనా తాగాలని తన తపన.

ఈ తపన, తాపత్రయం చూసి భర్త విశ్వం అన్నాడు.

"ఈ కాలంలో ఇల్లాళ్లకి పాలు సరిగా వుండకే ఇన్ని పాల డబ్బా కంపెనీలు వెలుస్తున్నాయి. అదేంటో నీకు పాలు మరీ ఎక్కువ. డాక్టరు నడిగి తగ్గడానికి మందులు వుంటాయి తెస్తాను వేసుకో అన్నాడు."

"వద్దండీ పాపాయి ఇంకా చాలా చిన్నది. కొద్ది రోజులైనా నా పాలు అది తాగాలి" అంది.

సాయంత్రం చీకటి పడ్డాక పాప లేచింది. మరొక సారి పాలు తాగించి ఎంతో సేపు ఊపగా ఊపగా నిద్రపోయింది పాప.

భోజనాలు అయాయి. దాన్ని తన మంచం మీద వేసి ప్రక్కన పడుకుందామనుకుంటుంటే, భర్త— "దాన్నెందుకు పడుకున్నదాన్ని లేపుతావు." అని రెండు చేతులూ పట్టి బలవంతంగా తన మీదకు లాక్కున్నాడు.

తనలో పొంగుతున్న మాతృత్వాన్ని, మమతానురాగాల్ని అతను గమనించడం లేదు. అవి అతని మనసును తాకడం లేదు. తన యౌవ్వనపు పొంగునే చూస్తున్నాడు. పాపకి జ్వరం రావడం అత్యల్ప సాధారణ విషయంగా కనిపిస్తుందతనికి. ప్రకృతిలో మాతృత్వ మమతే ఇంతగా లేకపోతే, ప్రతీ ప్రాణీ పుట్టిన వెంటనే గిట్టునేమో. ప్రకృతి అంతా నిండి ఉంది. 'మా' శబ్దం. ప్రకృతిలోని ప్రాణులన్నీ మాతృమమతలోనే బ్రతికి బట్ట కడుతున్నాయి.

వారించీ అతన్ని లాభం లేదు. అతని ఉద్యోగం పోయింది. తన ఉద్యోగంతోనే ఇల్లుగడుస్తుంది. న్యూనతా భావంతో ప్రతిదీ తప్పుపట్ట కోపగిస్తున్నాడు.

అతని తాపం చల్లార్చి కాళ్ళుచేతులూ, ఛాతీ కడుక్కుని చీర మార్చి పాపని ప్రక్కలో వేసుకుపడుకుంది.

ఆ మరునాడు పాపకి జ్వరం తగ్గింది. తనకి వచ్చేసింది. పాల జ్వరం.

నీవు రానక్కర్లలేదులే మందులు నేను తెస్తానని అన్నాడు. తెచ్చివేసాడు. అవేమి మందులో, పాపకి జ్వరంలో పాలీయవద్దంది డాక్టరమ్మ అన్నాడు. హోటల్ నుంచి కారేజీ తెస్తానన్నాడు.

## మిగిలిన రాత్రి

మేలుకుండానే
ఎన్ని స్వప్నాలో
ఈ కళ్ళకి!
తెల్లవారి ఒళ్ళు విరిచి
దుప్పటి దులిపితే
ఏ ఒక్క స్వప్నానికీ
సాక్ష్యం దొరకదు!

రాత్రంతా
సన్నటి వెల్లుం దుప్పటి కింద
ఇంత నా శరీరాన్ని దాచుకుని
నిద్రాముద్రల్ని వెదుకేనే
నాలోకి
ఆలోచనలు స్వప్నాలై
సర్పాలై
రాత్రంతా ఒకటే బుసబుసలు...

—ఎ.పి. చందన్‌రావు





రాయలసీమలో కోళ్ళ పెంపకం పరిశ్రమకు విశేష కృషి చేసిన డాక్టర్ ఎ. సుందరనాయుడుగారిని ఇటీవల చిత్తూరులో జరిగిన ఒక సమావేశంలో జిల్లా వ్యవసాయదారుల తరఫున కలెక్టర్ శ్రీ వెంకటపతిరాజు వెండి కోడితో సన్మానిస్తున్న దృశ్యం

"వద్దు నేనే వండుతా" అని వండింది.

ఆ జ్వరం నాలుగురోజులు పీడించింది. అతను చూడకుండా పాపకి పాలు ఇస్తూనే వుంది. కాని రోజ రోజుకు జ్వరం మహత్యమో, అతను తెచ్చిన మందుల మహత్యమో పాలు ఇగిరిపోయాయి. పాపకి పోతపాలే సైకిల్ పాలు.

నాలుగు రోజులు పాపకీ తనకీ బాగానే వుంది. ఆఫీసుకు వెళ్లింది.. పాపకి మళ్లీ విరోచనాలు.

"మీరు మగవాళ్లు.పాపని సాక లేరు. పల్లెలో మీకు మామ్మ వరసయే ఆవిడ వున్నది. తేరాదు?" అన్నది.

"మనమే ఇబ్బంది పడి చస్తుంటే ఆవిడొకర్తి—లేని పోని ఆలోచనలు పెట్టుకోకు. నేనున్నప్పుడు నేను, నాన్నగారున్నప్పుడు నాన్నగారూ చూస్తూనే వున్నారుగా అన్నారు.

ఎవరూ చూడనక్కర లేకుండానే ఓ రోజు నల్లగా కళ్లు మూసేసింది పాప. తాను దుఃఖ సముద్రమే అయిపోయింది. అన్న, వదినలు వచ్చి తనని తీసుకు వచ్చారు.

తన దుఃఖం ఎంత ఏడ్చినా తరగడం లేదు. ఆరోగ్యం బాగా తరిగిపోయింది. తన ఒంట్లో ఓపిక చిక్కడం లేదు. ఉద్యోగం చేయాలని లేదు— చేయకా తప్పదు.

భర్త ఒకటి రెండు సార్లు వచ్చి చూసి వెళ్లాడు. నీకే. వచ్చిందా ఈ ప్రపంచంలో ఈ కష్టం? జీతం నష్టం. మీద ఎన్నాళ్లు సెలవు పెడతావు?

"అందాకా అప్పు చేసుకు తినండి, లేదు మామ గారి డబ్బు వాడమనండి, తరువాత తిరిగి ఇచ్చేయవచ్చు." అంది. ఆ మాటకు కోపం వచ్చి అతను వెళ్లిపోయాడు?

ఈ సంఘటనలన్నీ జడివానలా, వడగళ్ల దెబ్బలా, తుఫానునాటి సముద్రపుటలల్లా, మనసును ఢీకొన్నాయి.

ఆ గేదెకి నోరు లేదు. ఆ పేయికి ప్రాణం లేదు.






శ్రీ నందిని సిధారెడ్డి గారి కవితా సంకలనం 'భూమిస్వప్నం' ఆవిష్కరణ మార్చి 24న హైదరాబాదులో జరిగిన సందర్భంగా వేదికపై డాక్టర్ సి. నారాయణరెడ్డి, శ్రీ డి. వెంకటరామయ్య, దేవిప్రియ, శ్రీ కె. శివారెడ్డి

దానిది మూగ చావు. మూగ బాధ? అంబా అని అరవడం లే— మూర్ఖులు పట్టించుకోరుగాని.

అన్నగారి పిలుపుతో ఆలోచనలు తెగిపోయాయి—

"అమ్మా వసూ తలుపు తీయమ్మా— నీకో మంచి వార్త చెబుతా" అన్నాడు అన్నగారు అర్థింపుగా.

కళ్లు తుడుచుకుని తలుపు తీసింది వసుంధర.

ఆమె తలుపులు వేసుకోవడంలోనే తమ ఓదార్పు మాటలు భరించలేదన్న విషయం స్పష్టపడింది. అందుకని—

"బావగారికి మళ్లీ మరో కంపెనీలో ఉద్యోగం వచ్చిందటమ్మా. పదిహేను రోజులైనా మనకి తెలియ జేయలేదు చూసావా?" అన్నాడు.

ఏదో కొంత బరువు తగ్గినట్లుగా నిట్టూర్చింది.

నీవు ఉద్యోగం చేస్తే చేయొచ్చు, మానితే మానొచ్చు. ముఖ్యంగా ఆయన అహం సంతృప్తి పడు తుంది. నీ బరువు కాస్త తగ్గుతుంది. కొంతసేపు మౌనంగా ఏదో ఆలోచిస్తూ ఉండి పోయింది.

"నేనింక వెళ్లిపోతాను అన్నయ్యా" అంది.

"నిన్ను వెళ్ళిపొమ్మని తొందర చెయ్యడం కాదమ్మా. ఆరోగ్యం కుదురు పడనీ వెళ్ళిపోదుగాని" అని అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

ఒక మంచి రోజు చూసుకుని ఒంటరిగానే తన ఇంటికి బయలు దేరింది. అన్న, వదినలు తోడు వస్తా నంటే వద్దంది. ఏమైనా గొడవలు రావచ్చునని. గదిలో ఏదో చదువుకుంటున్నాడు భర్త. "రా వసూ, ఒక్కర్తివే వచ్చావా? మీ అన్నయ్య రాలేదా అన్నాడు.

"లేదు" అని ముక్తసరిగా చెప్పి. ఒక కుర్చీలో కూర్చుంది.

కొంత సేపు కుశల ప్రశ్నలు అయాక—

"మీకు ఉద్యోగం అయిందటగా వచ్చి చెప్పారు కాదేం" చాలా సంతోషం. ఇక నేను ఉద్యోగం మానేస్తానండీ, మిమ్మల్నీ, మామగార్నీ, పుట్టబోయే పిల్లల్నీ, సంసారాన్నీ, ఇంటినీ. శ్రద్ధగా చూసుకుంటాను. అపుడు మీకూ హాయి. నాకూ హాయి. ఏమంటారు?" అన్నది.

తన భర్త ఆ మాటకు తప్పక సంతోషిస్తాడనుకుంది. చిరునవ్వుతో అతని జవాబు కోసం ప్రసన్నంగా చూస్తు ఉండిపోయింది.

వసుంధర అలా అడుగుతుందనీ, అదీ ఇంత చప్పన చెప్పవలసి వస్తుందనీ విశ్వం ఊహించలేదు. ముఖం దించుకుని మెల్లిగా చెప్పాడు. "నువ్వు ఉద్యోగం తోటే, పాపతోటే సమతమమయిపోతుంటే, నీకు చెప్పకుండానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాను వసూ, పాప పోతుందని అనుకున్నామా? అని కాస్తఆగి, "నువ్వు ఉద్యోగం మానక్కర లేదు మానొద్దు" అన్నాడు.

ఆజ్ఞలాంటి ధ్వని అతని గొంతులో.

దిమ్మెరపోయింది వసుంధర. తాను విన్నదేమిటో కొంతసేపు బోధపడ్లేదు. పడ్డాక, కొండరాయి ఏదో దొర్లుకుంటూ వచ్చి, నెత్తిమీద పడినట్లు అయింది. ఆకాశ గంగాప్రవాహమేదో తనని ఎంచున్నపళంగా అగాధాల్లోకి త్రోసేసినట్లు అయింది. తల్లో ఏవో మెరు పులు, మనసునేవో తుఫాను గాలులు ఊపేస్తున్నట్లు అంతరంగం అల్లకల్లోల సముద్రమైపోయినట్లు అను భూతి—

కన్నుల నుంచి అశ్రుధారలు. జడి వానలా— విశ్వం మంచం మీద నుంచి లేచి వచ్చాడు.

"నేను ఆపరేషన్ చేయించుకున్నానని ఏడుస్తు న్నావా? వసూ" అన్నాడు ఆమె తల నిమురుతూ—

వెక్కి వెక్కి పడుతూ కొంత తడవు మాట్లడలేక పోయింది. తరువాత రుగ్ధ కంఠంతో "—పాపకోసం" అంది.

"దానికేముంది మా అక్క పిల్లలెవర్నయినా పెంచు కుందాంలే" అన్నాడు అతి తేలిగ్గా.

విభ్రాంతితో అతనికేసి చూసింది. కన్నీళ్లాగి పోయాయి. మెరుపు కొట్టినట్లయింది. పిచ్చి పట్టి నట్లు గా అలా కొంత సేపు చూస్తూ వుండి పోయింది.

ఆ చూపులు అతన్ని నిలువునా కాల్చి వేస్తున్నట్లుగా వున్నాయి. హృదయాన్ని ముక్క ముక్కలు చేస్తు న్నాయి. తాను అనగూడని మాట ఏమిటన్నాడు? ఆలోచిస్తున్నాడు అననలసిన దేదైనా వుందా అని?

ఒక్క క్షణం మరి అక్కడ ఉండ లేకపోయింది వసుంధర. వచ్చిన దారినే ఊళ్లోనే ఉన్న అన్నగారింటి వైపు పరుగులాంటి నడకతో బయలుదేరింది.

దారిలో ఆమె కేమీ కనపడ్డం లేదు. వినబడ్డం లేదు. ఒక్క శబ్దం తప్ప.

వీధిలో ఓ గుమ్మం ముందర తల్లి శవం మీద పడి 'అమ్మ' అని ఏడుస్తున్న పిల్లల గొంతులోని శబ్దం ఎవరో ఈడ్చి తన్నుతూ లాక్కు పోతుంటే పది సంవత్సరాల పిల్లాడు— అరిచిన—'అమ్మా' అన్న అరుపు— 'అంబా' అని లేత పెయ్యని చూసి ఓదార్పు పొందలేని గేదె ఆర్తి.

ప్రకృతి సర్వం మాతృ శబ్దంతో మారుమ్రోగి పోతూ చెవులు దద్దరిల్లిపోతుంటే, రొప్పుతూ అన్నగా రిల్లు చేరి తన గదిలో మంచం మీద వాలి స్పృహ కోల్పోయింది వసుంధర. ఓ తల్లి. పాలవెల్లి.

# విదూషకుడి విరూపం- మధ్యయుగాలనాటి 'మాస్క్'

సోవియెట్ యూనియన్ మధ్యాసియా ప్రాంతంలోని సిర్‌దర్యా నదీతీరంలో ఒత్రార్ ఒయాసిస్ వుంది. దీని గట్టున మధ్య యుగాల్లో గొప్ప సంస్కృతి వర్ధిల్లిందని చెబుతూంటారు. ఈ వాదానికి బలం ఇచ్చే ఆధారం ఒకటి ఇటీవల బయటపడింది. క్రీస్తుశకం 10-12 శతాబ్దాలకు చెందిన జనావాస ప్రాంతాలలో త్రవ్వకాలు జరుపుతుండగా ఈ ఆధారం బయటపడింది. ఒత్రార్ ఒయాసిస్ ఒడ్డున వున్న కుయ్‌రిక్ తూబే ప్రాంతంలో నిర్వహించిన త్రవ్వకాల సందర్భంగా నటులు తగిలించుకునే విదూషకుడి ముఖం- మట్టితో చేసిన మాస్క్ దొరికింది.

ప్రాచ్య దేశాలలో తుర్కిస్ సాగ్‌ద్యాన్ కళాకారులు ఎంతో ప్రసిద్ధి పొందారు. ఈ తరహా మాస్క్‌లు ధరించి రంగస్థలం మీద అభినయించడంలో వాళ్ళు ఎంతో ప్రతిభ ప్రదర్శించేవారని చెప్పు కుంటారు. ఒత్రార్ వద్ద దొరికిన 'విదూషకుడి విరూపం' ప్రాచ్య సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తోంది. ఈ తరహా 'విరూపాల'ను ధరించి ఆనాటి నటులు ప్రేక్షకు లను అలరించేవారు.